అంగన్‌వాడీ టీచరే.. ఆయాగా

కందుకూరు, జూలై 7 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేకపోవడంతో టీచర్లే ఆయాలుగా మారుతున్నారు. ఆయాల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తుంది. దీంతో విద్యా బుద్ధులు నేర్పించాల్సిన చేతులు వంట పాత్రలను శుభ్రం చేస్తున్నాయి. మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 12 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయాలు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆయాలు చేయాల్సిన పనులతో పాటు తమ విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్‌గా ఆయాలను పెట్టుకోవాల్సి వస్తుందని, తమకు వచ్చిన వేతనాల నుంచి వారికి ఇవ్వాల్సి వస్తుందని తెలిపారు ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయాలను తక్షణమే నియమించాలని కోరారు.

కొత్తగూడ అంగన్‌వాడీ కేంద్రంలో వంట పాత్రలను శుభ్రం చేస్తూ.. ఊడుస్తున్న అంగన్‌వాడీ టీచర్ సరస్వతి

ఫిరాయింపులకే కాంగ్రెస్ పరిమితం

- సీఎం రేవంత్‌కు పాలనపై పట్టులేదు
- శాంతిభద్రతలు, పారిశుధ్యం గాడి తప్పింది
- బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు

ముషీరాబాద్, జూలై 7: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచి పాలనను పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పార్టీ ఫిరాయింపులకే పరిమితమయ్యారని బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు ఆరోపించారు. ఇతర పార్టీల ప్రజా ప్రతినిధులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంలో ఉన్న శ్రద్ధ పాలనను చక్కదిద్దడంలో లేదని మండిపడ్డారు. ఆదివారం ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపిస్తున్నాయని, పారిశుధ్య సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు. వర్షాలు కురుస్తూ రోగాలు ముసురుతున్న వేళ ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదని, నగరంలో హత్యలు అధికమయ్యాయని, సీఎంకు పాలనపై పట్టులేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చడం లేదని, నిరుద్యోగులు రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఆరోపించారు. పార్టీలు మారే నాయకులతో వచ్చే బీఆర్ఎస్‌కు వచ్చే నష్టం ఏమిలేదని, ప్రజాదరణ కోల్పోయిన వారే కాంగ్రెస్‌లో చేరుతున్నారని, అలాంటి వారితో కాంగ్రెస్ మునిగిపోవడం ఖాయమన్నారు. పార్టీ ఫిరాయింపులు మాని కాంగ్రెస్ పెద్దలు పాలనను గాడిలో పెట్టాలని హితవు ఫలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రజినీకాంత్ గౌడ్, ముప్పిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు

సివిల్స్ మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

హిమాయత్‌నగర్, జూలై 7: సివిల్స్ మెయిన్స్ రాసే పద్మశాలీ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కంద గట్ల స్వామి, నార్త్ అమెరికా పద్మశాలీ అసోసియేషన్ సలహాదారుడు సామల ప్రదీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్,పద్మశాలీ సేవా సమాజం ఆధ్వర్యంలో ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి,భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వారు తెలిపారు. శిక్షణ పొందేందుకు 8639998711 నంబర్‌ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

ఆటోబంద్‌ను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ అమానుల్లాఖాన్

హిమాయత్‌నగర్,జూలై7: ఆటో డ్రైవర్ల న్యాయపరమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఆగస్టు1న ఆటోబంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహమ్మద్ అమానుల్లాఖాన్ తెలిపారు. ఆదివారం హైదర్‌గూడ లోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ల చార్జీలు పెంచాలని,రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేదం అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ప్రతి ఆటో కార్మికుడికి రూ.12వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు లక్ష్మి నర్సయ్య,మహ్మద్ అజీమోద్దీన్, హమ్మీ, ఆంజనేయులు, అక్తర్, షేక్ షరీఫ్, షేక్ రహీం, రమేశ్, మహ్మద్ లతీఫ్ ఖాన్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

మాదిగలకు నాలుగు మంత్రి పదవులివ్వాలి

చిక్కడపల్లి, జూలై 7 : ప్రభుత్వం మాదిగ ఉపకులాలకు నాలుగు మంత్రి పదవులు ఇవ్వాలని, మాదిగ నిష్పత్తి ప్రకారం నామినేటెడ్ పదవులు కేటాయించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం లిబర్టీ అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనరాజు తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగతో కలిసి మాట్లాడారు. జూలై 7 ను మాదిగ అమరవీరుల సంస్మరణ దినంగా ప్రకటించారు. వర్గీకరణ పేరుతో రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు కానీ తమ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. మాదిగ అమరుల కుటుంబాలకు 250 గజాల స్థలాన్ని , రూ.20 లక్షల ఆర్థిక సహకారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగ మేధావుల ఫోరం నాయకుడు యాదగిరి, సురేశ్, గోపి, శివ, చందు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కనకరాజు,రాజు మాదిగ

వెటర్నరీ దవాఖాన ప్రారంభం

శంషాబాద్ రూరల్, జూలై 7 : మండలంలోని బుర్జుగడ్డతండా సమీపంలోని గోశాల వద్ద జంతు ప్రేమికుల విరాళాలతో రూ. 3 కోట్లతో నిర్మించిన వెటర్నరీ దవాఖానను ప్రారంభించిన్నట్లు గోశాల నిర్వాహకుడు ధర్మరాజ్ రాంఖా తెలిపారు. ధర్మరాజ్ రాంఖా మనుమరాలు డాక్టర్ నిషితా రంకఖా మాట్లాడుతూ దవాఖానలో ప్రతి రోజు 10 సర్జరీలతో పాటు 100 జంతువులకు చికిత్స అందించే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఐసీఏఐ విద్యార్థుల స్నాతకోత్సవం

విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

శేరిలింగంపల్లి, జూలై 7: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విద్యార్థుల స్నాతకోత్సవం గచ్చిబౌలిలోని ఇండోర్‌స్టేడియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరై సీఏ పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) సెంట్రల్ కౌన్సిల్‌సభ్యులు ముప్పాల శ్రీధర్, దయానివాస్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి 800 మంది, దేశవ్యాప్తంగా 9000 మంది చార్టెడ్ అకౌంట్స్ పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు.

టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రజా కార్యదర్శిగా అరుణేందర్ ప్రసాద్

టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రజా కార్యదర్శిగా ఎం. ఎన్.అరుణేందర్ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మరణం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ హుస్సేనీ.

– సిటీబ్యూరో, జూలై 7 (నమస్తే తెలంగాణ)

విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి

కుత్బుల్లాపూర్,జూలై7: క్షత్రియ సమాజ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ప్రణాళిక బద్ధంగా చదివి విజయానికి బాటలు వేసుకోవాలని బీసీ సంక్షేమం,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమ వంశీయ సహస్రార్జున క్షత్రియ(ఖత్రి/పట్కరి) ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు డా.విశ్వనాథ్ రవీందర్ అధ్యక్షతన జీడిమెట్లలో ఎస్ఎస్‌కే సమాజ్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా క్షత్రియ ఖత్రి కులానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించారు. ఐపీఎస్ అధికారి అక్షయ్ అనిల్‌వాఖరే, ఆర్టీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా.విశ్వనాథ్‌రవీందర్,అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సినీ కార్మికులను ఆదుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు ఈశ్వర్ రావు

ఖైరతాబాద్, జూలై 7 : చిత్రపరిశ్రమను నమ్ముకొని పనిచేస్తున్న సినీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలుగు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ నాయకుడు ఈశ్వర్ రావు కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్రపురి కాలనీలో చిత్రరంగంలోని 24 క్రాఫ్ట్ వారికి ఇండ్లు కేటాయించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీంతో కళారంగాన్నే నమ్ముకొని జీవిస్తున్న వారికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. నిబంధనల ప్రకారం జూనియర్ ఆరిస్టులకు రోజుకు రూ.900 చెల్లించాల్సి ఉండగా, కొందరు ఏజెంట్లు సభ్యత్వం లేని వారిని షూటింగ్‌లకు పంపి అర్హులకు అన్యాయం చేస్తున్నారని, వారిని దోచుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశ్, శంకురిరవీందర్, సుభానీ, రాజు, రవి శంకర్, సత్యం, నరేశ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్‌లో అక్రమాలపై విచారణ జరిపించాలి

ఖైరతాబాద్, జూలై 7 : తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు మేజర్ శివప్రసాద్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు, ఇతర శిక్షణ అవసరాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు రూ.2కోట్ల వరకు దుర్వినియోగమైనట్లు తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ధన, సీనియర్ కోచ్ కంది రవి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్

మాదాపూర్, జూలై 7: పిన్ టెక్ రంగంలో దూసుకుపోతున్న మోదీపై ఫార్మా రంగం చిన్న, మధ్య తరహా సంస్థలకు ఉపయోగపడే గ్రోత్ బూస్టింగ్ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న 73వ ఇండియన్ ఫార్మా సూటికల్ కాంగ్రెస్ మేకిన్ ఇండియాలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మోడీపై ఇండియా కంట్రీ హెడ్ సచిన్ నిగమ్ తో కలిసి గ్రోత్ బూస్టింగ్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశ ఎగుమతుల్లో ఫార్మా ఉత్పత్తులే ఐదో అతిపెద్ద కమాడిటీ అని, ఎగుమతుల్లో 5 శాతం కన్న ఎక్కువ వాటా ఫార్మా రంగానిదే ఉందన్నారు. గతేడాది మన దేశం రూ. 1.83 కోట్ల విలువైన ఫార్మసూటికల్ ఉత్పత్తులను ఎగుమతి చేసినట్లు తెలిపారు. ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. అనంతరం సచిన్ నిగమ్ మాట్లాడుతూ ఫార్మా ఎస్ఎంఈలను డిజిటల్ ఫైనాన్షియల్ టూల్స్‌తో ఎక్విప్ చేసేందుకు నగదు ప్రవాహాన్ని ఆప్టిమైజ్ చేసేందుకు గ్రోత్ బూస్టింగ్ సొల్యూషన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 55కి పైగా దేశాల్లో దాదాపు 1600 ల కంపెనీలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ముంబై, ఢిల్లీ, ఢాకా, దుబాయ్, హంకాంగ్, సింగాపూర్, న్యూయార్క్, మెక్సికో తదితర ప్రాంతాల్లో మోదీపై కార్యాలయాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

గ్రోత్ బూస్టింగ్ సొల్యూషన్స్ సభ్యులతో కలిసి ఆవిష్కరించిన మోదీపై ఇండియా కంట్రీ హెడ్ సచిన్ నిగమ్

స్ప్రింగర్ నేచర్ సైన్స్ జర్నల్‌లో సీడీఎఫ్‌డీ పరిశోధన పత్రం

సిటీబ్యూరో, జూలై 7(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌కు చెందిన పరిశోధకులు ఫంగస్ జీవక్రియలపై చేసిన పరిశోధనలను ప్రముఖ సైన్స్ జర్నల్ స్ప్రింగర్ నేచర్ పబ్లిషర్ ప్రచురించనుంది. టెక్స్ట్‌బుక్ ఆఫ్ జూనోసిస్ అండ్ సప్రనోసిస్ పేరిట ఈ పరిశోధనలను ప్రచురించనున్నారు. రూపిందర్ కౌర్, అస్మితా సరోగీ, మనీషా గోశ్‌లు ఫంగస్ జీవక్రియలపై చేసిన పరిశోధనలు చేయగా... ఆ ఫలితాలను ఈ జర్నల్ ప్రచురించేందుకు ముందుకు వచ్చింది. ఫంగస్ కారణంగా విపరీతంగా పెరుగుతున్న వ్యాధుల నియంత్రణకు ఈ పరిశోధనలు సాయపడుతాయని తెలిపారు. కాగా సీడీఎఫ్‌డీ పరిశోధనల కృషికి దక్కిన అరుదైన గౌరవమని పలువురు అభిప్రాయపడ్డారు.

సినీనటి అనుపమ సందడి

శేరిలింగంపల్లి, జూలై 7: ఖాజగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 34వ షోరూంను ప్రముఖ తెలుగు చలనచిత్ర నటి అనుపమ పరమేశ్వరన్ ఆదివారం ప్రారంభించి సందడి చేసింది. షాపింగ్ మాల్ డైరెక్టర్ సురేశ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ

సుల్తాన్‌బజార్,జూలై 7: సమాజంలో అందరితో పాటు దివ్యాంగులు సమానవకాశాలు పొందాలని టీసీపీ వేవ్ సంస్థ ప్రతినిధి పవన్ అన్నారు. ఆదివారం కింగ్‌కోఠి జిల్లా దవాఖాన ఆవరణలోని శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగ సహాయతా సమితి ఆధ్వర్యంలో 50 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్‌లు, వాకర్లు, మూడు చక్రాల సైకిళ్లు,హ్యాండ్ కిట్లు,కాలిపర్స్ వంటి పరికరాలను సీఎస్ఆర్‌లో భాగంగా టీసీపీ వేవ్ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను ఉపయోగించి దివ్యాంగుల జీవితాల్లో మార్పులు తేవాలన్నదే తమ సంస్థ లక్ష్యమని అన్నారు. ఈ స్ఫూర్తితో తన తల్లి జన్మదినం సందర్భంగా డిసెంబర్ 6న సుమారు 500 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తామని తెలిపారు. సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ స్వప్న వాయువేగుల మాట్లాడుతూ పారా ఒలింపిక్స్ వంటి క్రీడల్లో భారతీయులు ఎంతో ప్రతిభ చూపిస్తున్నారని దివ్యాంగులకు కొంత సహాయం అందించగలిగితే వాళ్లు సమాజంలో అందరితో సమానంగా ముందుకు వచ్చి గౌరవ ప్రదమైన జీవితం గడుపుతారని అన్నారు. కార్యక్రమంలో ఫిక్కీ ఐటీ చైర్మన్ మోహన్ రాయుడు,సీనియర్ పాత్రికేయులు రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ సూరావధుల రాము, డీసీఎస్ఐ సీఈఓ డాక్టర్ శ్రీరామ్, ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ హమీద్ హుస్సేన్, సల హాదారు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలు, ట్రై సైకిళ్లు అందుకున్న దివ్యాంగులను అభినందిస్తున్న టీసీపీ వేవ్ సంస్థ ప్రతినిధి పవన్

కౌన్సెలింగ్ కేంద్రంలో కమిషనర్ పరిశీలన

మారేడ్‌పల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన

మారేడ్‌పల్లి, జూలై 7: మారేడ్‌పల్లి లోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కళాశాలను సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన ఆదివారం సందర్శించారు. పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఈఏ పీసీ ఈటీ కౌన్సెలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించారు. కౌన్సెలింగ్ జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి సౌకర్యాలను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, లెక్చరర్లను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఉమెన్స్ హాస్టల్ ను సందర్శించి విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు.

డబుల్ బెడ్రూం ఇండ్లకు వసతులు కల్పించండి

సిటీబ్యూరో, జూలై 7 (నమస్తే తెలంగాణ) : డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించిన లబ్ధిదారులకు కనీస వసతులు కల్పించాలని కోరుతూ టు బీహెచ్‌కే ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోల్కొండ చౌరస్తాలోని అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కనీస సౌకర్యాలు లేవని, తాగునీరు, కరెంట్, రహదారులు, లిఫ్టులు లేక ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఉందని అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస రావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి లబ్ధిదారుల కష్టాలను తీర్చాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు లక్ష్మి , హబీబ్, సుల్తానా, మంజుల, సునీత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టు బీహెచ్‌కే ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస రావు

సీనియర్ సైంటిస్టులకు ఘనంగా వీడ్కోలు

సిటీబ్యూరో, జూలై 7(నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పరిశోధన కేంద్రంలో పలువురు సీనియర్ సైంటిస్టులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఐఐసిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖరం, డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ వేణుగోపాల్ రాజు, శ్రీధర్ కుమార్, డాక్టర్ రమేశ్‌బాబు, అశోక్ కుమార్‌తోపాటు, శశికళ పలు హోదాల్లో రీసెర్చ్ సెంటర్‌లో సేవలందించి, ఇటీవల పదవీ విరమణ పొందారు.